# నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రణాళికాబద్ధంగా విత్తనాల స్టాక్ అందుబాటులో పెట్టుకోవాలి
- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం నవభూమి బ్యూరో, మే 20:** జిల్లాలోని రైతులకు నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లతో నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో విత్తనాల డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్ముతున్నారని, 99 శాతం వరకు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, ఒక్క శాతం కూడా పొరపాట్లు జరగకుండా రాబోయే సీజన్ లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.

జిల్లాలో రాబోయే వానాకాలం సాగుకు అవసరం అయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ ఆ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్






వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో రైతులంతా ఒకేసారి నాట్లు వేయకుండా, ప్రణాళిక ప్రకారం నాట్లు జరిగేలా చూడాలని, ప్రతి మండలం పరిధిలో ఎప్పుడు నాట్ల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ తయారు చేసుకోవాలని, వరియేతర పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. విత్తనాల బ్యాగ్ పై లేబుల్, నిల్వ చివరి గడుపు తేదీ మొదలగు వివరాలకు స్పష్టంగా తెలియజేసి అమ్మాలని అన్నారు. విత్తనాల అమ్మకం రికార్డ్ వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసిన సమయంలో రికార్డులు అప్ డేట్ కాకపోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తనాల అమ్మకం సమయంలో రైతులకు తప్పనిసరిగా తేది, విత్తనం వివరాలతో సహా రశీదు అందించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు, రిటైలర్లు మాత్రమే విక్రయించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. క్రాప్ బుకింగ్ సమయంలో ప్రతి రైతు దగ్గర విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయో వివరాలు సేకరించాలని కలెక్టర్ ఏఈఓ లకు సూచించారు. జిల్లాలో విత్తనాల షాపుల తనిఖీ షెడ్యూల్ రూపొందించాలని, ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని, ప్రతి షాపును పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. గత సీజన్ లో జిల్లాలో పత్తి, మిర్చి వంటి పంటలు 300 నుంచి 400 ఎకరాలలో దాదాపు 100 మంది రైతులు నకిలీ విత్తనాల బాధితులయ్యారని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతుల పక్షంగానే ప్రభుత్వం జిల్లా యంత్రాంగం పని చేస్తుందని, రైతులకు నష్టం చేకూర్చాలని ఎవరైనా వ్యాపారి భావిస్తే వారి పట్ల జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న వివిధ చట్టాలను వినియోగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సంబంధిత డీలర్ల నుంచి రైతులకు శాస్త్రీయంగా నష్టపరిహారం అంచనా వేసి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్ముతున్నట్లు డీలర్లకు తెలిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించే విత్తన డీలర్ల పట్ల అనవసరపు చర్యలు అధికారుల వైపు నుంచి కూడా ఉండవని, అనవసరంగా ఇబ్బందులకు గురి చేసే



ప్రక్రియ చేయవద్దని కలెక్టర్ తెలిపారు. మార్కెట్ లో డిమాండ్ లేని విత్తనాల రకాలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ విస్తరణ అధికారి మిర్చి, వరి, మక్క వివిధ రకాల పంటలలో ఉపయోగించకూడని విత్తనాల రకాలపై తన క్లస్టర్ పరిధిలో ప్రకటన జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవిరాణి, వెంకటేశ్వర రావు, విజయచంద్ర, సరిత, మండల వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ రిటైలర్లు, తదితరులు పాల్గొన్నారు



నవభూమి
జిల్లా అనుబంధం
21 మే,2025 బుధవారం పేజిలు:7
www.epaper.navabhoomi.in


# డాక్టర్లు టైం పాస్ చేస్తున్నారా!

- బూర్గంపాడు పర్యటనలో అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

**బూర్గంపాడు మే 20 నవభూమి:** రెండు కోట్ల 70 లక్షల రూపాయల నిధులతో బూర్గంపాడు మండల కేంద్రంలో ఉన్నటువంటి సామాజిక హెల్త్ సెంటర్ లో నూతన ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఉదయాన్నే బూర్గంపాడు విచ్చేశారు. ఆయనకు సిహెచ్సి డాక్టర్లు, సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు.



ఆసుపత్రి మొత్తం కలియతిరిగి అన్ని పరిశీలించారు మెరుగైన సేవలు అందించడం లేదని డాక్టర్లు సరిగా పనిచేయటం లేదని అసహనం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్. ఇది ఆసుపత్రిలగా లేదని మ్యూజియం లాగా ఉందని ఇక్కడ కేవలం విధులకు వస్తూ టైంపాస్ చేసుకుని వెళ్ళిపోతున్నారని ఇలాగైతే మిమ్మల్ని అందరిని సుగుణ ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ చేయడం జరుగుతుందని ఎవరు పనిచేయకపోయినా వారిని ఇక్కడి నుంచి పంపడం ఖాయమని హెచ్చరికలు జారీ చేశారు. కేవలం వారం రోజులు సమయం ఇస్తున్నట్లు ఈలోగా మెరుగైన సేవలు భూర్గంపాడు సిహెచ్సిలో కొనసాగాలని హెచ్చరించారు. పనిచేయడం లేదని ఇలాగే కొనసాగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు మిగిలిన సెంటర్లో ఓపి బాగా ఉందని బూర్గంపాడులో చాలా డల్గా ఉందని ఇది కరెక్ట్ కాదని మార్పు చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆయన వచ్చేటప్పటికి అక్కడ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు గైర్హాజరు కావడంతో అసహనానికి గురవడం వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ చేసి మందలించటం జరిగింది. కొద్దిసేపటి తర్వాత వచ్చిన ఆర్ అండ్ బి అధికారులను ప్రశ్నించారు నేను వచ్చేటప్పటికి ముందుగానే ప్లాన్ చేసుకోవాలి కదా ఇప్పటిదాకా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సదరు కాంట్రాక్టర్కు సూచనలు చేశారు వర్షాకాలం వచ్చేలోపే గ్రౌండ్లో లెవెల్ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు అన్ని పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు

# ఆదివాసీల అభివృద్దే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం

- ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



**చర్ల / కొత్తగూడెం మే 20 నవభూమి ప్రతినిధి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం చర్ల పోలీసుల ఆధ్వర్యంలో చర్ల మండలంలోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఈ గ్రామంలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే మహిళలకు, చిన్న పిల్లలకు దుస్తులతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ



సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని 90 కుటుంబాలలో నివసించే యువత, పిల్లలు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై లు కేశవ, నర్సిరెడ్డి సిఆర్పిఎఫ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

## కూసుమంచి డివిజన్ సహా వ్యవసాయ సంచాలకులు సరిత





**తిరుమలాయపాలెం నవభూమి మే 20–** తిరుమలాయపాలెం మండలంలో నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి డివిజన్ సహా వ్యవసాయ సంచాలకులు శ్రీమతి సరిత అన్నారు మంగళవారం తిరుమల పాలెం మండల ఎరువులు పురుగుమందులు విత్తనాల డీలర్ల సమావేశం నిర్వహించినారు ఇట్టి సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది కావున విత్తన డీలర్లు అధికృత కంపెనీల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి వారి నుండి ఓ ఫారములు ఫారం సి మరియు జీవోటి సర్టిఫికెట్లను తీసుకొని ఓపారాలను లైసెన్స్ నందు ఇంక్లూడ్ చేసుకోవాల్సిందిగా చెప్పినారు మరియు రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని వాటి మీద రైతు మరియు డీలర్స్ సంతకం పెట్టాలని చెప్పినారు ఓ ఫారాలు లేని విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మరియు నేమ్ బోర్డు స్టాక్ బోర్డు ప్రైస్ బోర్డు తప్పనిసరిగా మెయింటైన్ చేయాలన్నారు పత్తి విత్తనాలు అమ్మినప్పుడు రైతుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు మరియు ప్రతిరోజు స్టాక్ రిజిస్టర్ నందు సేల్స్ రాయాలన్నారు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటూ పీడీ యాక్ట్ పెడతామన్నారు ఇట్టి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ నారెడ్డి సీతారామరెడ్డి పాల్గొన్నారు

# ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభం



**ఎరుపాలెం, నవభూమి,మే 20 :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు ఎరుపాలెం కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యాశాఖ అధికారి మురళీమోహన్ రావు మంగళవారం ప్రారంభించారు. ఉదయం10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఐదు రోజులు పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. మండలంలో అన్ని ప్రాథమిక,ప్రాథమికొన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణా తరగతులు రిసోర్స్ పర్సన్‌గా నంద్రు వెంకటేశ్వరరావు, బి మదన్మోహన్ రెడ్డి, వి నాగరాజు, ఆర్ భరత్, ఎస్.కె కాజా మొహి ద్దిన్, ఎం సుధాకర్, సిహెచ్ నరసింహారావు, త్రివేణి విద్యాబోధనను సులభ పద్ధతులలో విద్యార్థులకు ఎలా నేర్పించాలనే అంశంపై ఐదురోజులుపాటు ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.77 మంది ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సంవత్సరం ప్రభుత్వం గవర్నమెంట్ పాఠ శాలను బలోపేతంచేసే దిశగా ప్రతి పాఠ శాలకు చెందిన ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారి తెలిపారు

# నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన

## ■ కార్మిక సంఘాల జేఏసీ




**సత్తుపల్లి, నవభూమి, మే 20 :** నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని మంగళవారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ రింగ్ సెంటర్లో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా నాయకులు అమర్లపూడి శరత్, ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకుడు కొలికపోగు సర్వేశ్వరరావులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించు కోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్స్ ను అమలు చేయడంలో చురుగ్గా వ్యవహరిస్తుందన్నారు. శ్రామిక ప్రజలపై బానిసత్వ ధోరణి ప్రదర్శిస్తూ ఉందన్నారు. ఎనిమిది పని గంటల విధానం అమల్లో ఉండాలని కనీస వేతనాలు సామాజిక భద్రత కోసం కేంద్ర కార్మిక సంఘాలు పోరాడుతున్నాయన్నారు. పని పరిస్థితులకు సంబంధించిన కార్మికుల అన్ని ప్రాథమిక హక్కులకు తీవ్రమైన సవాళ్లు ఎదురవుతున్నాయ న్నారు. కార్మిక సంఘాలు వీటిని పరిగణిస్తున్నాయ న్నారు. నూతన చట్టాలు సంపూర్ణంగా అమల్లోకి వస్తే యూనియన్ గుర్తింపు సామూహిక బేర సారాలు ఆందోళనలు పోరాటాలు సమ్మె హక్కులతో సహా నిరసన వ్యక్తం చేసే హక్కులు కోల్పోతామన్నారు. ఏ విధమైన సామాజిక అభిప్రాయ వ్యక్తీకరణలకు అవకాశం ఉండదన్నారు. అన్ని హక్కులను లాక్కోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని వారు విమర్శించారు. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఐదు శాతం జనాభా కలిగిన కార్పొరేట్ పెట్టుబడుదారులు బడా వ్యాపారస్తుల సంపద 70 శాతం ఉందన్నారు. పేద, మధ్యతరగతి, కార్మిక వర్గం నుండి వచ్చిన 50 శాతం మందికి సంపదలో కేవలం మూడు శాతం మాత్రమే ఉందన్నారు. కేంద్రంలో పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఈ అసమానతలను పెంచి పోషిస్తుందన్నారు. పేదలను మరింత పేదలుగా ధనవంతులను మరింత ధనవంతులుగా చేసే కుట్రలో భాగంగానే అసమానతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. 10 ఏళ్ల పాలనలో పేదరికం 17% పెరిగిందన్నారు. ప్రఖ్యాతి చెందిన ఆర్థిక సంస్థలు నిర్వహించిన సర్వేలో అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం 2018లో 90% కుటుంబాల కనీస జీవన ప్రమాణాలు అత్యంత పేదరికంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వే స్టేషన్, విమానశ్రయాలను ఇప్పటికే ప్రైవేటీకరణ చేసి దేశ సంపద మొత్తం కార్పొరేట్ చేతుల్లో పెడుతుందని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేసి కార్మికులు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐనాయకులు రవి, కృష్ణ,వెంకటేష్, బాజీ, వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులుయోబు, ఏఐటీయు సి నాయకులు శ్రీను, రాంబాబు, పుల్లయ్య, వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు

# కులగణనలో లంబాడి జనాభా సంఖ్యను ప్రభుత్వం వెల్లడించాలి

## ■ గిరిజన హక్కుల సాధనకై రాష్ట్ర స్థాయి ఉద్యమం

## ■ కరపత్ర ఆవిష్కరణలో రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్



**సత్తుపల్లి, నవభూమి, మే 20 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన కులగణనలో లంబాడీ జనాభా సంఖ్యను ఇప్పటికైనా బహిర్గతపరచాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్ అధ్యక్షన జరిగిన సమావేశంలో చలో ఖమ్మం పోస్టర్ ను ఆవిష్కరించారు. జూన్ 8న ఉదయం 11:00 లకు ఐఎంఏ హాల్ సమావేశం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ లో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలన్నారు. గౌర్ బోలి భాషను అధికారికంగా గుర్తించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్ లో చేర్చాలన్నారు. గిరిజనులకు 10% రిజర్వేషన్ ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్ లో చేర్చాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్ ను కేంద్ర ప్రభుత్వం 7.5% నుండి 14 శాతానికి పెంచాలన్నారు. శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఐచ్చిక సెలవుదినంగా కాకుండా సాధారణ సెలవుదినం గా ప్రకటించాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. పోడు భూములకు పట్టాలు, లావణి భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ద్వారా జారీ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ జి.ఒ.18, తేది:16.07.2024 ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100% శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.మైదాన ప్రాంతంలో గిరిజనుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటైన గిరిజన తండాల గ్రామపంచాయితీలను రెవెన్యూ పంచాయితీగా గుర్తించాలన్నారు. గ్రామపంచాయితీల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ ను ఏర్పాటు చేయాలన్నారు. సబ్ ప్లాన్ నిధులను గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ట్రైకార్ ఋణాలను తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకై గిరిజన ప్రజలు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో. రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి కృష్ణా నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయక్, సత్తుపల్లి మండల అధ్యక్షుడు కృష్ణా నాయక్, అజ్మీరా రామకృష్ణ నాయక్,. రాము నాయక్, వెంకటేశ్వరావు, చిన్నారావు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ప్రారంభం

**జూలూరుపాడు, మే 20 (నవభూమి ప్రతినిధి)–** మండల కేంద్రంలో గల కస్తూరి బా గాంధీ విద్యాలయం నందు ఉపాధ్యాయుల ఐదు రోజుల వృత్యంతర శిక్షణ కార్య క్రమాన్ని మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని,విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడానికి వృత్యంతర శిక్షణ కార్యక్రమాల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 100% విద్యార్థుల చేరికను నమోదు చేయడానికి డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేస్తూ బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మండలం నుండి 74 మంది ఉపాధ్యాయులకు హాజరైనట్లు తెలిపారు. వివిధ



అంశాలలో మండల రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు

# జల్లేపల్లి పిఎంశ్రీ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా సమ్మర్ క్యాంప్



**తిరుమలాయపాలెం నవభూమి మే 20-** తిరుమలాయపాలెం మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మే 10వ తారీకు నుండి 25వ తారీకు వరకు 15 రోజులపాటు సమ్మర్ క్యాంపును విజయవంతంగా నిర్వహిస్తున్నారు.సమ్మర్ క్యాంపు యొక్క ముఖ్య ఉద్దేశాలు పాఠశాల హెడ్మాస్టర్ దార రాజేష్ వివరిస్తూ విద్య బోధనకు భిన్నమైన అనుభవం, పాఠ్యపుస్తకాలకు భిన్నంగా సరదాగా నేర్చుకునే విధానాలను అందించడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, స్టేజి యాక్టివిటీస్, ప్రజెంటేషన్స్ వంటి కార్యక్రమాల ద్వారా వారికి భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని కలిగించడం, మానసిక, శారీరక అభివృద్ధిలో భాగంగా చిత్రలేఖనం, నృత్యం, చేతిరాత నైపుణ్యం, యోగ, క్రీడలు మరియు ఇతర శారీరక కార్యకలాపాల ద్వారా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం పిల్లలు సహ పాఠకులతో కలిసి పనిచేయడం, చర్చలు, గేమ్స్ ద్వారా సహకార భావన, నాయకత్వ నేతృత్వ లక్షణాలు అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ యొక్క సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని పాఠశాల హెడ్మాస్టర్ దార రాజేష్ తెలియజేశారు . ఈ యొక్క కార్యక్రమాలు నిర్వహించుట కొరకు గాదరి సుమలత, గాదరి ప్రణయ్ కుమార్ లు ఇద్దరు టీచర్లుగా వ్యవహరిస్తున్నారు. పిల్లలకు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు కార్యక్రమాలు నేర్పుతున్నారు. పిల్లలకు అల్పాహారంగా రోజుకో రకం పండ్లు బిస్కెట్లు స్నాక్స్ వంటి ఆహారాన్ని అందిస్తున్నారు వేసవిలో పిల్లలు వృధాగా తిరగకుండా ఈ యొక్క క్యాంపు నిర్వహిస్తున్నందుకు పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు

# ఆంజనేయుని సన్నిధిలో ముస్లిం భక్తుడు అబ్దుల్



**పెనుబల్లి, నవభూమి, మే 20:** అతనొక ముసల్మాన్.... ఓ టైలర్... అయితేనేం అల్లాతో పాటుగా హిందూ దేవుళ్ళను సైతం పూజిస్తాడు.. మతం, కులం ఏదైనా దేవుళ్లంతా ఒక్కటే అంటూ హిందువులతో సమానంగా పూజలు చేస్తాడు... రుద్రాక్షలు చేతబూని జపాలు చేస్తాడు. ప్రదక్షణాలు చేస్తాడు.. ప్రసాదాలు తింటాడు... పదిమందికి పంచిపెడతాడు. ఆ ఆదర్శముస్లిం జై శ్రీరామ్ అంటూ గొంతు చించుకుని నినదిస్తాడు. అందరి ప్రశంసలు అందుకుంటున్న అబ్దుల్ ఓ నిరుపేద. పెనుబల్లి మండలకేంద్రం బి సి కాలనీకి చెందిన అబ్దుల్ కొన్ని దశాబ్దాలుగా దర్జీగా పనిచేస్తూ ఎంతోమందికి వృత్తిని నేర్పించి మంచి టైలర్గా పేరు తెచ్చుకున్నాడు. ఆధునిక పద్ధతులు వృద్ధి చెంది రెడీ మేడ్ రంగం పల్లెలకు వ్యాపించి టైలరింగ్ రంగం వెనుకపడ్డప్పటికి తాను మాత్రం ఈ వృత్తినే నమ్ముకుని కష్టపడి కుటుంబాన్ని పోషించుకున్నాడు. అందరిని గౌరవిస్తూ తాను గౌరవించబడుతున్నాడు. అబ్దుల్ ప్రతి రోజూ నిద్ర లేవగానే నిష్టగా స్నానం ఆచరించి పెనుబల్లి లోని ముత్యాలమ్మ తల్లి గుడికి, వి ఎం బంజర్లోని ఆంజనేయస్వామి ఆలయంకు వెళ్లి ముందుగా ప్రదక్షణాలు చేస్తాడు. జై శ్రీరామ్ అంటూ భజనలు చేసుకుంటూ ఆలయం చుట్టూ తిరుగుతాడు. పర్వదినాల రోజూ ఉపవాసం వుంటూ జాగారం చేస్తుంటాడు. పండుగ వేళల్లో ఆలయంలో జరిగే ఉత్సవాలలో తోటి భక్తులకు సేవలందిస్తాడు. కొంతమంది భక్తులు గుడికి వచ్చి దండం పెట్టుకుని హడావిడిగా వెళ్ళిపోతుంటారు. ఏదో మొక్కుబడిగా వచ్చి పూజలు చేసి పోతుంటారు. కానీ అబ్దుల్ మాత్రం ఆలయానికి వచ్చి గంటలు తరబడి పూజలు చేసుకుని తీర్ధ ప్రసాదాలు తీసుకొని మరీ వెళ్తాడు. అబ్దుల్ భక్తిశ్రద్ధలు చూసి అందరు ప్రశంశిస్తున్నారు. హిందూ, ముస్లింసోదరులందరు అబ్దుల్ ను ఆదర్శంగా తీసుకుంటే మత విద్వేషాలకు చోటుండదు

# పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నేత నరేష్ రెడ్డి





**తిరుమలాయపాలెం నవభూమి మే 20-** మండల పరిధిలోని మేడితపల్లి గ్రామంలో జరిగిన షేక్ పాష వివాహానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి హాజరయ్యారు నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందజేశారు అదే విధంగా సుబ్లేడు గ్రామంలో జరిగిన గంధసిరి వారి పెళ్లి వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందజేశారు మరియు సంక వారి పెండ్లి వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ వెంకటనారాయణ సుమన్ రెడ్డి రవికాంత్ రెడ్డి నవీన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ నాయకులు గుర్రం విజయ్ కుమార్
- ఏఐకేఎంకేఎస్ జాతీయ నాయకులు ప్రసాదన్న



**బూర్గంపాడు మే 20 నవభూమి:** ప్రజల పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించబడతాయని, హక్కులు సాధించుకోగలుగుతారని, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ నాయకులు గుర్రం విజయ్ కుమార్, ఏఐకేఎంకేఎస్ జాతీయ నాయకులు ప్రసాదన్న పిలుపునిచ్చారు. సారపాకలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా స్థాయి సదస్సు ముగించుకుని మంగళవారం తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం జిల్లా కార్యదర్శి డి పున్నంచంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడిన గ్రామీణ ప్రాంత ప్రజానీకం, రైతు కూలీలు, అడవి పై ఆధారపడిన ఆదివాసీ గిరిజనుల, కార్మికుల, ఇతర పీడిత వర్గ ప్రజలు తాము పోరాడి సాధించుకున్న రాజ్యాంగ హక్కులను, ప్రజలకు ఉపయోగపడే చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం యదేచ్ఛగా ఉల్లంఘిస్తూ, మరోపక్క బడా కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులకు దేశాన్ని దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. నిన్న జరిగిన తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా స్థాయి సదస్సు తీర్మానాలను, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెమిడి ఉప్పలయ్య ఈ సందర్భంగా ప్రకటించారు. తెలంగాణ రైతు కులీ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సదస్సు తీర్మానాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1) గోదావరి ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన మేరక ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల పట్టాలు ఇచ్చి అక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, అదేవిధంగా ఫారెస్ట్ వారి ఆక్రమణలో ఉన్న నాగినేని ప్రోలు రెవెన్యూ 437/1 సర్వేనెంబర్ భూమిని కేటాయించి గుర్తిస్తాం లేని పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, హైకోర్టు తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.

2)1/70 చట్టం, పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, 5, 6 షెడ్యూల్ చట్టాలన్నీ ఆదివాసులైన పోడు సాగుదారులకు భూమి హక్కును సాగు హక్కును నివాస హక్కులను కలిగించుతున్నాయి భద్రతను ఇస్తున్నాయి ఈ చట్టాలన్నింటిని పాలకులు అమలు చేయకుండా నిర్వీర్యపరిచే చర్యలకు పూనుకుంటున్నాయి అన్ని చట్టాలను యధాతథంగా అమలు చేయాలి.

3) ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలకు, తప్పుడు చర్యలకు, అవినీతికి అవకాశం ఇవ్వకుండా ఖాస్తులో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ బెనిఫిట్స్ అన్నిటిని అమలు చేయాలి.

4) సీతారామ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడం లేదు. పాలకుల పక్షపాత వైఖరిని వదిలించుకుని, కాలువల మొదటి నుండి సాగునీరు అందించడానికి తగిన ఏర్పాటు చేయాలని.

5) సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్వాసితులతో పాటు బి టి పి ఎస్ రైల్వే లైన్ కింద, సింగరేణి భూసేకరణలో భూములు కోల్పోతున్న తిర్లాపురం, విజయనగరం, రామానుజవరం, సాంబాయిగూడెం, సమ్మక్కపేట చిక్కుడు గుంట మొదలగు గ్రామాలలోని రైతు కూలీల నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తగిన నష్టపరిహారం నివాసాల కొరకు సాగుదారులకు భూమి జీవనాధారం కొరకు ఆందోళనలు చేస్తున్నారు. వీరి సమస్యలు పట్టించుకోని పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర పాలకులదేనని డిమాండ్ చేస్తున్నాం. సదస్సు తీర్మానాలను, రైతు కూలీ సంఘం ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని కెమిడి ఉప్పలయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎఫ్ టి యు, న్యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, తెలంగాణ రైతుకూరి సంఘం రాష్ట్ర నాయకులు ఈర్ల పైడి, బొర్ర ఆనంద్, తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు బండ్ల వెంకటేశ్వర్లు, కుంజ వెంకటేశ్వర్లు, కారం నరసింహారావు, తోలెం మమత, ఊకే సుశీల, సో ఉంది గోపమ్మ తదితరులు పాల్గొన్నారు

# వివిధ అనారోగ్య సమస్యలతో ఇరువురి మృతి

**జూలురుపాడు, మే 20 (నవభూమి ప్రతినిధి)-** మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన మల్కం వెంకటేశ్వర్లు మంగళవారం గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు.ఆయన స్థానిక సెయింట్ ఆంటోనిస్ పాఠశాల బస్ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. కాకర్ల గ్రామంలో కాకర్ల గ్రామానికి చెందిన సిద్దేల కిశోర్ సతీమణి శ్రావణి (21) ఇటీవల కాన్పు జరిగి ఆడపిల్లకు జన్మ నిచ్చింది.అనంతరం అస్వస్థత గురై చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచారు. ఈ విషాద సంఘటనల పట్ల పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

**వినోబా నగర్ వద్ద బైక్ కారు ఢీ.**

మండల పరిధిలోని వినోబాగనగర్ గ్రామ సమీపంలో జిల్లా సరిహద్దు ప్రాంతంలో మంగళ వారం కారు,ద్విచక్ర వాహనండీ కొట్టిన సంఘటన జరిగింది.ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం తీవ్రంగా దెబ్బతిన్నాది.వాహన దారునికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు

# తిరుమలాయపాలెం ఆసుపత్రిని సందర్శించిన శివకుమార్







**తిరుమలయపాలెం నవభూమి మే 20-** కొత్తగా వచ్చిన 108,102,1962 సర్వీసుల జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్. తిరుమలాయాపాలెం సిహెచ్ యు ఆసుపత్రి ని మంగళవారం సందర్శించారు ఈ సందర్భంగా వారు108,102 మరియు నియోనేటల్ అంబులెన్స్ సేవలు అందులో వున్న అధునాతన పరికరాలు(మానిటర్, సిరంజి పంపు, వెంటిలేటర్, బేబీ వార్మర్ గురించి హాస్పటల్ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు శివకుమార్, దుర్గాప్రసాద్ నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది శ్రీనివాస్ ,సీతారాం, ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి కృపా ఉషశ్రీ,, స్టాఫ్ నర్సులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి శిక్షణాశిబిరం

**అశ్వారావుపేట టౌన్ మే 20 నవభూమి:** గత 15 రోజులుగా అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి హరిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణాశిబిరం సోమవారంతో ముగిసింది. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన మండల విద్యాధికారి పి ప్రసాదరావు మాట్లాడుతూ 15 రోజుల నుండి శిక్షణాశిబిరాన్ని చక్కగా నిర్వహించారని విద్యార్థులు అనేక అంశాలను తెలుసుకోవడంతో పాటు ఆటలు కూడా అడుకోవడం వారికి ఈ వేసవిలో ఆటవిడుపుగా ఉంటుందని అన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో సహా షెడ్యూల్ ప్రకారం అన్ని అంశాలను నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థులు ఈ శిబిరం ద్వారా ఏ మేరకు ఉపయోగం పొందారనేది వారితోనే చెప్పించారు. విద్యార్థులు ఈ శిబిరంలో తయారు చేసిన వివిధ కళాకృతులను, చిత్రకళను పరిశీలించారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కిషోర్, నర్సింహారావు, పి.ఇ.టి రాజు,సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు





# పాల్వంచలో వామ పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన





**పాల్వంచ టౌన్ మే 20 నవభూమి ప్రతినిధి:** జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా వామ పక్ష కార్మిక సంఘాలు సీఐటీయు, ఏఐటీయుసీ పాల్వంచ పట్టణ కమిటీల ఆద్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ లో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులను బిక్షగాళ్లను చేసే కుట్రలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతున్నదని, వివిధ ప్రభుత్వ రంగ పరిశ్రమలను రైల్వే, విమానాశ్రయలు, సముద్ర ఫోర్ట్ లు కార్పొరేట్ కంపినీలకు కట్టబెడుతున్నారని, ఆయన విమర్శించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేట్ కంపినీలకు కట్టబెట్టి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేయడానికి గేట్లు తెరుస్తున్నారని, నుతన విద్యావిధానం పెరుతో చరిత్రను మరుగుపర్చి మతపరమైన అంశాలతో దేశాన్ని నాశనం చేయడానికి పూనుకొన్నారని, రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన స్వేచ్ఛా స్వాతంత్రాలను హరిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి తీసుకు రావలనే కుట్రలు చేస్తున్నారని, అందుకే జులై 9, 2025న జరిగే సమ్మెలో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని ప్రజా వ్యతిరేక విదానాలపై కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీ ఐ టీ యు పట్టణ కన్వీనర్ కే సత్య, ఏ ఐ టీ యు సీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి నాగేశ్వరరావు, ఏ ఐ.టీ. యూ సీ పట్టణ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, సీ.ఐ.టీ. యు నాయకులు బుస్సా మోగిలి, రోజా, సురేందర్, ఏఐటీయూసీ నాయకులు ఇట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

# ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సామాజిక మాధ్యమాల్లో ఎయిడ్స్ నియంత్రణ పట్ల ప్రచారం కల్పించాలి
- హెచ్ఐవి హెల్ప్ లైన్ నెంబర్ 1097 కు ప్రాచుర్యం కల్పించాలి
- హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ, తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, నవభూమి బ్యూరో, మే 20:** హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ నియంత్రణ, తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. హెచ్.ఐ.వి. ఎయిడ్స్ నియంత్రణ పద్ధతుల పై అవగాహన కల్పన, హై రిస్క్ ఏరియాలో తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఎన్ని స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి, ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై వాటి పని తీరు, వివరాలను పర్యవేక్షించేందుకు వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ముందుగా జిల్లాలో ఎయిడ్స్ హెచ్.ఐ.వి. వ్యాధి పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, హై రిస్క్ ఉన్న వర్గాలలో పెళ్లికి ముందు తప్పనిసరిగా పరీక్షలు చేసుకునేలా చూడాలని అన్నారు. తల్లికి ఎయిడ్స్ వ్యాధి ఉన్నట్లు ముందుగానే తెలిస్తే బిడ్డకు వ్యాపించకుండా నిరోధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించేలా చిన్న చిన్న వీడియోలు, ఫోన్ మెసేజ్ తయారు చేయాలని అన్నారు. ప్రతి నెలా ఇటువంటి ఫోన్ మెసేజ్ వీడియోలను గ్రామ వాట్సప్ గ్రూపులలో ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. సరైన చికిత్స తీసుకొనే విధంగా, వచ్చిన వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నమోదవుతున్న కేసుల నియంత్రణకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ హెల్ప్ లైన్ 1097 పట్ల ప్రాచుర్యం కల్పించాలని ఆసుపత్రిలో రిసెప్షన్, మందుల షాపు, క్యాంటీన్ వంటి వివిధ ప్రదేశాలలో పాంప్లెట్ లను ఉంచాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలకు నిర్వహించే ఆరోగ్య సమావేశాల్లో ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాప్తి నియంత్రణకు విస్తృత ప్రచారంతో, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ తర్వాత బాధితులతో కాంటాక్ట్ ఉన్న వ్యక్తులకు కూడా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు రెగ్యులర్ గా అందించి వాడే విధంగా చూడాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు రెగ్యులర్ గా మందులు తీసుకోవాలని, వారిని ఎప్పటి కప్పుడు ఫాలో అప్ చేయాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల మందులను సబ్ సెంటర్ల వద్ద అందుబాటులో పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, అడిషనల్ డి.ఎం.అండ్ హెచ్.ఓ. డా. పి. వెంకట రమణ, ఏ.ఆర్.టి. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. పి. మోహన్ రావు, డేటా మేనేజర్ పి. శ్రీకాంత్, ఏ.పి.పి.ఏ., సి.ఎస్.సి. సి.ఎల్.హెచ్. లు, కౌన్సిలర్ లు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి

## జిల్లా రవాణా అధికారి వెంకటరమణ



**కొత్తగూడెం మే 20 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం జిల్లా రవాణా కార్యాలయంలో మంగళవారం వివిధ స్కూల్ బస్సుల డ్రైవర్లకు బస్సు ఫిట్నెస్,రహదారి భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్నెస్ చెక్ చేసిన తర్వాతనే పిల్లలను బస్సులలో ఆహ్వానించాలని, ప్రతి వాహనానికి అటెండెంట్ ఉండాలని, ప్రతి నెల డ్రైవరు తమ ఆరోగ్యం పరీక్షలు చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, చట్ట ప్రకారం నడుచుకోవాలని, స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సు పాటించవలసిన నియమాల గురించి కరపత్రాలు విడుదల చేశారు.

# రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

## కాంట్రాక్టర్ నాసిరకం పనులు వల్లనే ప్రమాదాలు



**అన్నపురెడ్డిపల్లి మే 20 నవభూమి:** అన్నపురెడ్డిపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే ఆర్ అండ్ బి రహదారిపై సీతాయిగూడెం అబ్బుగూడెం గ్రామ శివారులో రోడ్డు కుంగడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామానికి చెందిన రాచూరి శ్రీనివాసరావు, రాచూరి నాగలక్ష్మి, దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజుల క్రితం దమ్మపేట మండలం మోడేవెర్రి గ్రామానికి చెందిన వ్యక్తులు తీవ్రగాయాలు అయ్యాయి. సంబంధించిన ఆర్ అండ్ బి అధికారులు పటించుకోపోవడం గమనార్హం

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ముచ్చర్ల మాజీ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ

**కామేపల్లి,నవభూమి, మే 20 :** కామేపల్లి మండలం ముచ్చర్ల మాజీ సర్పంచ్ జాటో త్ జాయ్ లూసీ వివాహ మహొత్సవానికి మంగళవారం హాజరై నూతన వధూవరు లను ఆశీర్వదించారు.సూర్య తండ గ్రా మంలో జాటోత్ బాలు-లక్ష్మి కుమారుడి వివాహ వేడుక కు హాజరై నూతన వధూ వరులను బి ఆర్ఎస్ మండల నాయకు రాలు, ముచ్చర్ల గ్రామ మాజీ సర్పంచ్ జా టోత్ జాయ్ లూసీ ఆశీర్వదించడం జరి గింది



# ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వీరయ్యకు సతీ వియోగం

## ■ సంతాపం తెలిపిన వనమా రాఘవ

**కొత్తగూడెం మే 20 నవభూమి ప్రతినిధి:** ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ సతీమణి పాల్వంచలో మంగళవారం మృతి చెందారు. ఆమె అంత్య క్రియలు సుజాతనగర్ లో నిర్వహించారు. ఆమె అంతిమ యాత్రలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేంద్ర రావు పాల్గొని పాడేమోశారు. తనకు అత్యంత ఆప్తులు సుజాతనగర్ మండల మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య సతీమణి త్రివేణి ఆకస్మిక మృతి కి సంతాపం తెలిపారు. రాఘవ కూడా కన్నీటి పర్యంతం అయ్యారు. వనమా రాఘవ వెంట మాజీ మాజీ ఉర్దూగర్ చైర్మన్ అన్వర్ భాష, కొత్వాల సత్యం ముత్యాల రమణమూర్తి చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, కొత్త మాజీ కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, లక్ష్మీదేవిపల్లి మండలం బి ఆర్ ఎస్ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు,బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షుడు సంకుబాపన అనుదీప్, మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు తులసి రెడ్డి సుజాతర్ మండల కార్యదర్శి సత్యనారాయణ వినోద్,ఏనుగుల శ్రీను , గౌస్ సురేందర్ తమ్మిశెట్టి అశోక్,



ఎండి మజీద్, రెడ్డి బ్రదర్స్, పోకల నాగేష్, రమేష్, కొయ్యడ శీను, పెయింటర్ రాజేష్, కరాటి శ్రీనివాస్ యాదవ్, రాజేందర్, హుస్సేన్,సురేందర్, సయ్యద్ హైమత్, బొందుగుల శ్రీధర్, నారకట్ల శేఖర్,పాల్వంచ మండల పార్టీ అధ్యక్షులు పూసల విశ్వనాథం తుంపూరి ప్రసాద్,ఆవునూరి చంద్రయ్య సుజాతనగర్ మండల మహిళా నాయకురాలు కనుకుంట్ల నిర్మల గడ్డం వెంకటేశ్వర్లు, ఎగ్బాల్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు

# జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

## ■ జాతీయ పోటీలకు ఎంపికైన గీతా హర్షిణిని అభినందించిన నాగా సీతారాములు



**రుద్రంపూర్ మే 20 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం చండీఘర్ లో ఈ నెల 25 నుండి 3 రోజుల పాటు జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఆర్ గీత హర్షిణి ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో 65 కేజీల బాలికల ఫ్రీ స్టైల్ విభాగంలో జాతీయస్థాయి క్రీడాకారులతో తలపడి అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుపొంది జాతీయ పోటీలకు అర్హత సాధించిన గీతాహర్షిణి గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో అనేక పతకాలు బహుమతులు గెలుపొందారు. గీత హర్షిణి జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 ఇంక్లైన్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ సభ్యులు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ నాగ సీతారాములు గీతాహర్షిణి ని అభినందించి సాలువ తో సత్కరించారు. గీత హర్షిణి కి పోటీలలో పాల్గొనందుకు కావలసిన క్రీడా సామాగ్రి, ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయడం జరిగింది. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యుడు త్రీ ఇంక్లైన్ కాంగ్రెస్ కార్యకర్త గాంధీ కూడా తన వంతు ఆర్థిక సహాయాన్ని గీత హర్షిణి కి అందించారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ గీత హర్షిణి రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటినట్టుగా చండీఘర్





లోజరగబోయే జాతీయ రెజ్లింగ్ పోటీలలో తన సత్తా చాటి బంగారు పతకాన్ని గెలుపొంది జిల్లా ఖ్యాతిని చాటడంతో పాటు అంతర్జాతీయ స్థాయికి కూడా ఎంపిక కావాలని ఆయన సూచించారు. రెజ్లింగ్ లో ప్రతిభ కనపరిచే క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడలలో రాణించి ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా రిజర్వేషన్ ద్వారా మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని నాగా సీతారాములు సూచించారు. రెజ్లింగ్ సీనియర్ క్రీడాకారిని పి నిహారిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి పి కాశీహుస్సేన్, జిల్లా ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బరిగెల భూపేష్. జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇంద్రాల శ్రీధర్, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి. కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ రవి, కాంగ్రెస్ నాయకులు దొమ్మేటి రవికాంత్, పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు

# భీమవరంలో ఘనంగా కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి


**ఎర్రుపాలెం,నవభూమి,మే 20:** మండల పరిధిలోని భీమవరం గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో 1913 మే ఒకటిన ధనిక కుటుంబంలో సుందరయ్య పుట్టాడని తెలిపారు.13వ ఏట నుండి తన గ్రామంలో వెట్టి చాకిరి అంటరానితనం అసమానతులకు వ్యతి రేకంగా పోరాటం చేశారన్నారు.10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచి పెట్టి,వేలాది గ్రామాలలో గ్రామసభలు పెట్టి దున్నేవాడుకేభూమికావాలని,భూస్వామ్య విధానం పోవాలని పేద ప్రజలను చైతన్యం చేస్తూ అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర సుందరయ్యకుఉందని వారన్నారు. తన చిన్న వయసు నుండి చనిపోయేంత వరకుఅనునిత్యం సిపిఎంపార్టీని ముందు కు తీసుకుపోయేందుకు ఎర్రజెండా పేద లకు అండ అంటూ 40 సంవత్సరాల క్రితం తుదిశ్వాస



విడిశారన్నారు.వారి ఆశయాన్ని మరువబోమని వారి ఆశయ సాధన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ముందుకు వెళుతుందని ఈ దిశలో ప్రజలు యువత యువకులు ముందుకు రావాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లపూడి పెద్ద కోటేశ్వర రావు,శాఖ కార్యదర్శి నల్లబోతు హను మంతరావు,తల్లపురెడ్డి సీత రామిరెడ్డి, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్: వ్యక్తి మృతి





**అన్నపురెడ్డిపల్లి మే20 నవభూమి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎర్రగుంట గ్రామానికి చెందిన ఎస్కే మౌలానా (70) దగ్గర్లోని మసీదుకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వైపు బొగ్గును తీసుకెళ్తున్న టిప్పర్ ఎక్కువ ట్రిప్పు తోలకం తొలాలనే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మౌలానా అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ ఆందోళన చేశారు.

## కేసీఆర్‌కు నోటీసులు.. స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, మే 20 నవభూమి:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు విలేకర్లుతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. నోటీసులు ఇప్పుడే కదా ఇచ్చింది.. ఆయన వెళ్తారనే తాను అనుకుంటున్నానన్నారు. అయితే చట్టం ముందు అందరూ సమానమేనని ఆయనని చెప్పారు. తప్పు చేయక పోతే భయం ఎందుకు అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంలో తనపై కేసీఆర్ పెట్టిన కేసులు ఎదుర్కొన్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన తప్పేం లేదంటూ కేసును కోర్టు కొట్టేసిందన్నారు. ఎనిమిదేళ్ల పాటు.. ఈ కేసులతో పోరాడానని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మరోవైపు గత కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్లాది రూపాయలు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రాజెక్ట్‌లోని కొన్ని పిల్లర్లు కుంగాయి. ఈ నేపథ్యంలో దీనిని నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారాస్త్రంగా మలుచుకొంది. తాము అధికారంలోకి వస్తే.. దీనిపై విచారణ జరిపిస్తామని ప్రకటించింది. ఇక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో జస్టిస్ పిసి ఘోష్ సారథ్యంలో కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్.. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై విచారణ చేపట్టింది. అందులోభాగంగా ఇప్పటికే వరకు ఉన్నతాధికారులు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేసింది. అయితే తాజాగా నాటీ సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన హయాంలో ఆర్థిక శాఖ మంత్రులుగా పని చేసిన ఈటల రాజేందర్, హరీశ్ రావులకు సైతం నోటీసులు జారీ చేసింది. వీరింతా విడివిడిగా విచారణకు హాజరుకావాలంటూ జారీ చేసిన నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. దీంతో కేసీఆర్.. ఈ విచారణకు హాజరువుతారా? లేదా అన్న సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది

## విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకే
# వృత్త్యంతర శిక్షణా కార్యక్రమం







**పాల్వంచ టౌన్ మే 20 నవభూమి ప్రతినిధి:** జిల్లా స్థాయిలో జరుగుతున్న 5 రోజుల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని పురస్కరించుకొని, జెడ్ పి హెచ్ ఎస్. కొమ్ముగూడెం నందు నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి ఎం వెంకటేశ్వర చారి సందర్శించినారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ప్రతి సబ్జెక్టులో మెలుకువలు నేర్చుకొని, సరళమైన పద్ధతిలో విద్యార్థులకు బోధనను అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సద్వినియోగపరచుకొని సబ్జెక్టులో వారి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. హైస్కూల్లో బోధించే ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాల నిర్వహిస్తున్నామని, ప్రాథమిక పాఠశాలలలో బోధించే ఉపాధ్యాయులకు అన్ని మండల కేంద్రాలలో ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కో-ఆర్డినేటర్ యస్. కె. సైదులు, డిఆర్పి లు సంపత్, ప్రభుసింగ్, అపక శంకర్, మోహన రావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హాజరయ్యారు

# కార్మికుల వారసులకు కారుణ్య నియామక పత్రాల అందజేత





**రుద్రంపూర్ మే 20 నవభూమి:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పని చేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ మరియు మరణించిన కార్మికుల అర్హత కలిగిన డిపెండెంట్లకు కారుణ్య నియామకాల కొరకు ధరఖాస్తు చేసుకున్న కార్మికుల పిల్లలకు మంగళవారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేం రాజు కారుణ్య నియామక పత్రాల అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జీఎం మన సంస్థ సిఎండి ఆదేశాల మేరకు 2018 సంవత్సరము నుండి కారుణ్య నియామకాలను జరుగుతున్నవి ప్రస్తుతం ఈ నెలలో అత్యధికంగా 19 మందికి కారుణ్య నియామకాల పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. వారికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన ఈ అవకాశాన్ని శ్రద్ధగా క్రమశిక్షణతో నాగాలు లేకుండా పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని రానున్న కాలంలో వారి విద్యార్హత కు తగిన స్థాయిలో ఉద్యోగాలను పొందాలని ఆకాంక్షించారు. కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభం అయిన అప్పటి నుండి ఈరోజు వరకు మొత్తంగా కొత్తగూడెం ఏరియాలో 669 మందికి కారుణ్య నియామక పత్రాలు అందచేశామని వారు కంపనిలో బదిలీ వర్కర్ లాగ నియమకాము అయ్యి కంపనీ నిర్వహించిన అంతర్గత పరీక్షలలో అర్హత సాధించిన వారు ప్రమోషన్ పొంది వివిధ పోస్టులలో పని చేస్తున్నారని అన్నారు మరీ ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగమును పొందిన వారసులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞులై ఉండాలని, అలాగే సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలని వారికి లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని, ఈ మధ్యకాలంలో అత్యధికంగా నూతనంగా ఉద్యోగాలలో చేరిన బదిలీ వర్కర్స్ ఎక్కువమంది గైర్హాజరు అవుతున్నారని, ఉద్యోగాల పట్ల శ్రద్ధ కలిగి గైర్హాజరు చేయకుండా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం గారితో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ఓటు జిఎం జి.వి కోటిరెడ్డి, డిజిఎం పర్సనల్ బి. శివ కేశవ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం. మురళి, యూనియన్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది మరియు ఉద్యోగ నియామక పత్రాలు అందుకొనుట కొరకు వచ్చిన అభ్యర్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నాలాల విస్తరణ పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలి

**కూకట్ పల్లి, మే 20, (నవభూమి ప్రతినిధి) :** రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని నాలాల విస్తరణ పూడిక తీత పనులు వెంటనే చేపట్టి వరద ముంపు ప్రాంతాలను నుండి ప్రజలను రక్షించాలని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కూడా అధిక వర్షాలు వరదలు మూలంగా నాలాల విస్తరణ చేపట్టని కారణంగా అల్లాపూర్ బాలానగర్ పరిసర ప్రాంతాలన్నీ వరద పోటెత్తి ప్రజలు చాలా ఇబ్బందులు గురయ్యారని జెడ్ సి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం అలా కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూకట్పల్లి ఒకటనీ, దీన్ని దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టి ట్రాఫిక్ రద్దీనీ క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు ఆయా పనుల అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో



ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారంలో చర్చించి సానుకూలంగా స్పందించినట్లు రమేష్ పేర్కొన్నారు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య కూడా ఉన్నారు

# టీపీసీసీలోకి మనవారెందరో?

## వారంలో పార్టీ పదవులపై కీలక నిర్ణయం

## జిల్లాల వారీగా నేతల జాబితా సిద్ధం

## పాత కమిటీలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

## నూతన కార్యవర్గంలో ఎంతమందికి ఛాన్స్ దక్కేనో?

**యాదాద్రి: మే 20 నవభూమి :**కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా రు. ఎన్నికల అనంతరం సీఎంగా ప్రభుత్వ బాధ్యతల్లో ఆయన బిజీగా ఉండటంతో ఏఐసీసీ అధిష్ఠానం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేషకుమార్‌గౌడ్‌ను నియమించింది. అయితే ఏడాది కాలంగా పార్టీ కార్యవర్గం, అనుబంధ కమిటీలను మాత్రం నియమించలేదు. దీంతో టీపీసీసీ పదవుల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అయితే ఈ కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి స్థానం దక్కుతుందోననే చర్చ జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నా, ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా పార్టీ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యం లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ (టీపీసీసీ) నూతన కార్యవర్గం ఏర్పాటుపై అధిష్ఠానం దృష్టిసారించింది. నూతన కమిటీ నియామకంపై ఏఐసీసీ కసరత్తు ప్రారంభించింది. గతంలో ఎన్నికల సమయం కావడంతో టీపీసీసీకి జంబో కార్యవర్గా న్ని నియమించింది. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పజెప్పింది. ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌తోపాటు టీపీసీసీ ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులుగా, సభ్యులుగా పలువురు సీనియర్ నేతలకు అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయి నూతన కమిటీని ఎన్నుకునేందుకు అధిష్ఠానం ప్రక్రియను ప్రారంభించింది. జిల్లాల వారీగా ఎవరెవరికి పార్టీ పదవులు కట్టబెట్టాలనే అంశంపై టీపీసీసీలో తీవ్ర చర్చ సాగుతోంది. ఏఐసీసీ నేతలతో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి జయంతి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్, ఇతర సీనియర్ నేతలు నూతన కమిటీపై కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే ఏర్పడనున్న కమిటీలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పదవులు ఎవరికి దక్కుతాయోనని సీనియర్ నేతలంతా ఎదురుచూస్తున్నారు.

పాతవారికి పదవులు దక్కేనా? టీపీసీసీ అధ్యక్షుడిగా ఎ.రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో జంబో కార్యవర్గం ఏర్పడింది. అయితే ఈ సారి నూతన కమిటీని ఎన్నుకునే విషయంలో అధిష్ఠానం అన్ని సమీకరణలను పరిగణనలోనికి తీసుకుంటోంది. ప్రధానంగా పార్టీలోని సీనియర్ నేతలకు పదవులు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. శాసనసభ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలోని పార్టీలోని సీనియర్ నేతలైన భువనగిరి మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రస్తుత ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బండ్రు శోభారాణి, కొండేటి మల్లయ్య, పటేల్ రమేషరెడ్డిని నియమించింది. ప్రధాన కార్యదర్శులుగా ప్రస్తుత ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధిగా, మీడియా ఇన్‌చార్జీగా బోరెడ్డి అయోధ్యరెడ్డి, కార్యదర్శిగా ఉపేందర్‌రెడ్డి, సభ్యులుగా తంగెళ్లపల్లి రవికుమార్, తదితరులను నియమించింది. ఎస్సీ విభాగం బాధ్యతలు ప్రీతంకు అప్పగించింది. గత టీపీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ నేతలకు కీలక పదవులు దక్కాయి. అందులో కొత్తగా ఏర్పడే కమిటీలో ఎంతమందికి స్థానం దక్కుతుందోనని పార్టీలో చర్చ సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఎన్నికలలోపు పార్టీ పదవుల అప్పగింత పూర్తిచేసి, నూతన కార్యవర్గానికి సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, చైర్మన్లు ఇతర పదవులపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించనుంది. మరోవైపు పార్టీ పదవుల కోసం స్థానిక నేతలు అధిష్ఠానం పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఎలాగైనా ఈ సారి కీలక బాధ్యతలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు పార్టీ పదవులు కష్టమే?

టీపీసీసీ కార్యవర్గంలో ఉన్న చాలా మంది ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్నారు. అయితే పదవులు ఉన్న వారికి నూతన కమిటీలో అవకాశం ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై పార్టీలో చర్చ సాగుతోంది. ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారికి ఎట్టి పరిస్థితుల్లో పార్టీ పదవులు ఇవ్వకూడదనే నిబంధనను తీసుకురావాలని పార్టీ యోచిస్తోంది. ఒకవేళ పార్టీ పదవి ఇవ్వాల్సి వస్తే నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాలని కోరే అవకాశం కూడా ఉందని పార్టీలోని సీనియర్ నేతలు చెబుతున్నారు. అయితే గత టీపీసీసీలో కీలక బాధ్యతలు నిర్వహించిన బండ్రు శోభారాణి, పటేల్ రమేషరెడ్డి, బోరెడ్డి అయోధ్యరెడ్డి, ప్రీతం, ఎంపీగా గెలుపొందారు

# మ్యాచింగ్ గ్రాంట్ చెక్ అందజేత





**రుద్రంపూర్ మే 20 నవభూమి :** జీకే ఓసి ఈపి ఆపరేటర్ లేట్. మూల్చంద్ మణుగూరు పీకే ఓసిలో డంపర్ పై విధులు నిర్వహిస్తూ దురదృష్టవశాత్తు 19 డిసెంబర్ 2024 న యాక్సిడెంట్ అయ్యి మరణించడం జరిగింది. మరణాంతరం సింగరేణి ఉద్యోగుల నెలసరి జీతం నుండి రూ 20ల చొప్పున రికవరీ చేసి కంపెనీ మొత్తంగా రూ.10,46,892 రూపాయల చెక్కును మూల్చంద్ సతీమణి శ్రీమతి హరిదేవి విశ్వకర్మ కు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు అందజేశారు. మేనేజ్మెంట్ షేర్ రూ.10,00,000 రూపాయలను బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి ఎఫ్.డి.ఆర్ (ఫిక్స్ డిపాజిట్ రిసిప్ట్) ను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ మూల్చంద్ విధి నిర్వహణలో మరణించడం చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ ఏ.ఉపేంద్ర బాబు, ఎస్ ఓ టు జిఎం జివి కోటిరెడ్డి, డిజిఎం(పర్సనల్) బి శివ కేశవ రావు, జీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీ రమేష్, జీకే ఓసి యాక్టింగ్ మేనేజర్ వివి మధుకర్, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌరియా, జీకే ఓసి సంక్షేమాధికారి ఎండి. ఖలీల్ అహ్మద్, జీకే ఓసి ఏఐటియుసి పిట్ సెక్రెటరీ ఎం.ఆర్.కే.ప్రసాద్, ఐఎన్టియుసి పిట్ సెక్రెటరీ గోపు కుమార్, ఇతర యూనియన్ ప్రతినిధులు కే. రాములు, జె.గట్టయ్య, సిహెచ్. సాగర్, కే.సౌజన్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# సింగరేణి భవిష్యత్తుకు యువతరం అధికారులు బాసటగా నిలవాలి

- మూడేళ్లలో అనుభవజ్ఞులైన అధికారులందరి పదవీ విరమణ
- సింగరేణి చరిత్రలో తొలిసారిగా 762 మంది మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లలకు
- కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ చర్యలకు అధిక ప్రాధాన్యత
- సిఎండీ బలరామ్ దిశా నిర్దేశం




**కొత్తగూడెం మే 20 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థలో రానున్న మూడేళ్లలో అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో యువ సింగరేణి అధికారులు ఇప్పటి నుండే సంస్థ ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలు, వ్యాపార విస్తరణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని, సంస్థ భవిష్యత్తుకు బాసటగా నిలవాలని సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ చరిత్రలో తొలిసారిగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులైన మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లతో ఆయన మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కర్తవ్య ప్రబోధం చేశారు. అన్ని ఏరియాల నుండి వివిధ విభాగాలకు చెందిన సుమారు 762 మంది ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఛైర్మన్‌తో పాటు సంస్థ డైరెక్టర్లు వివిధ విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సింగరేణి ప్రస్తుత బొగ్గు ధర దేశంలో ఏ ఇతర బొగ్గు కంపెనీల కన్నా చాలా ఎక్కువగా ఉందని, కనుక వినియోగదారులు తక్కువ ధరకు బొగ్గు లభించే వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చాలా ప్రమాదకరం కనుక కనీసం టన్నుకు వెయ్యి రూపాయలు తగ్గించే విధంగా సింగరేణి వ్యాప్తంగా ఉత్పాదకత పెంచాలని, ఉత్పత్తి వ్యయం తగ్గించాలని, ఇందుకు యువ అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాత గనులు కొన్ని మూతబడుతున్న నేపథ్యంలో, ఒడిశాలోని నైనీ బ్లాకు, కొత్తగూడెంలో వి కే ఓ సి, ఇల్లందులో జే కే ఓసి, బెల్లంపల్లిలో గోలేటి ఓసిల నుండి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నామని, తద్వారా 20 మిలియన్ టన్నుల అదనపు ఉత్పత్తి సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు. కనుక ఈ ఏడాది నిర్దేశిత 76 మిలియన్ టన్నుల లక్ష్యాలు సాధించే అవకాశం ఉందన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలలో కూడా బొగ్గు బ్లాకులు చేపట్టడానికి సింగరేణి సంస్థ ముమ్మరంగా ప్రయత్నిస్తోందన్నారు. కానీ రానున్న కాలంలో సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి పైనే ఆధారపడి మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. పర్యావరణ ఆంక్షలు, బొగ్గు నిల్వల తరుగుదల వల్ల మరో 20 ఏళ్లలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతుందని, తద్వారా బొగ్గు ఉత్పత్తి కూడా తగ్గుతుందన్నారు. కనుక సింగరేణి సంస్థ కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టాలని నిర్ణయించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా కీలక ఖనిజాల ఉత్పత్తిదారులకు సంపూర్ణ ప్రోత్సాహం ఇస్తున్నందువల్ల ఈ రంగంలో సింగరేణి మంచి అవకాశాలు ఉండబోతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఇతర ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి కూడా సింగరేణి అడుగుపెడుతోందని, దీనికోసం మూడు ఏజెన్సీలను కూడా నియమించుకోవడం జరిగిందన్నారు. అవసరమైతే ఇతర కంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్ గా కూడా ఈ రంగాల్లో ముందుకు వెళ్తామన్నారు. ఇప్పటికే సింగరేణి ఓవర్ బర్డెన్ నుంచి ఇసుక తయారీ యూనిట్లను ఏర్పాటు చేసిందని, అలాగే ఫ్లై యాష్ నుండి, కార్బన్ డయాక్సైడ్ నుండి ఇతర ఉత్పత్తులు సాధించడానికి రంగం సిద్ధమైందన్నారు. దీనికి ముందస్తుగా సింగరేణి ప్రాంతంలో జియో కెమికల్ లేబరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వారు 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారని, దీనిలో సింగరేణి కనీసం నాలుగు నుంచి ఐదు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి పూనుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదనను 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ ఏర్పాటు ద్వారా 2000 మెగావాట్లకు పెంచుతున్నామని, ఒడిశాలో మరో 1600 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తద్వారా రాష్ట్రంలో అత్యధిక థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థగా సింగరేణి నిలవబోతుందన్నారు. సింగరేణి బహుముఖ విస్తరణ చర్యల పైన, ఆర్థిక స్థితిగతుల పైన భవిష్యత్తులో సింగరేణికి నాయకత్వం వహించనున్న నేటి యువ అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్న ఉద్దేశంతోటే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ల ద్వారా వివిధ విషయాలను లోతుగా వివరించారు. ఆ తరువాత ఏరియాల నుండి యువ అధికారులు తమ సలహాలను, సూచనలను, సందేహాలను కూడా వ్యక్తం చేశారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. కొత్తగూడెం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఛైర్మన్‌తో పాటు, డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, ఎల్.వి .సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, జీఎం సి పి పి మనోహర్, కార్పోరేట్ జీఎంలు ఇంకా వివిధ విభాగాల అధికారులు, హైదరాబాద్ కార్యాలయం నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్. డి. ఎం.సుభాని, జీఎం మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు